క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలు సాధించాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను శనివారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని, చదువుతోనే భవిష్యత్ ఉన్నత స్థానంలో ఉంటుందన్నారు. రుచికరమైన భోజనం అందించాలని, ఎలాంటి సమస్యలున్నా తెలియజేయాలన్నారు. రికార్డులు, వంటగదిని పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించి సర్వే ప నులపై అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ వెంటనే పూర్తి చేయాలని ఎలాంటి తప్పులు లేకుండా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, సిబ్బంది పాల్గొన్నారు.

పాన్‌కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలి

శ్రీరాంపూర్: కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఆదాయ పన్ను శాఖ నిబంధన మేరకు తమ పాన్‌కార్డును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సన ల్) అరవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు శ్రీరాంపూర్ ఏరియాలో సుమారు 350మంది ఉద్యోగులు తమ పాన్‌కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకోలేదన్నారు. దీని జాప్యం కొనసాగితే ఆదాయ పన్ను నిబంధన ప్రకారం జరిమానా కూడా విధించనున్నట్లు తెలిపారు. కావున ఉద్యోగులు వెంటనే తమ పాన్‌కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సిందిగా తెలిపారు.

సదుపాయాలు కల్పించాలి

వేమనపల్లి: కేజీబీవీ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు సక్రమంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి, ఏడీ ఎస్ఎల్ఆర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వేమనపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల, నీల్వాయి కస్తూరిబా పాఠశాలను శనివారం సందర్శించి పాఠశాలల్లో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. భోజన వైద్య సదుపాయాలు సక్రమంగా ఉండాలన్నారు. అనంతరం మండలంలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వేను పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎస్‌వో మయూరి, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో గణపతి, ఎంపీవో బాపు

జైపూర్: మండల కేంద్రంలోని జైపూర్, కోటపల్లి గురుకుల పాఠశాలలో జెడ్పీ సీఈవో గణపతి, ఎంపీవో బాపుతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని, వంట సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. వసతి గృహం పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలన్నారు.

గ్రూప్ 2 కోసం ఉచిత మాక్‌టెస్టులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్–2 పరీక్ష సన్నద్ధం అవుతున్న మైనారిటీ(ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు) యువతకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత మాక్ టెస్టులు నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 29 వరకు జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లోని ఎఫ్–5 జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మాక్ టెస్టులు డిసెంబర్ 2, 3, 9, 10 తేదీల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు మాక్ టెస్టులు ఉంటాయని వివరించారు. వివరాల కోసం కార్యాలయంలో పనివేళల్లో, 8555917862 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

శ్రీరాంపూర్: దొంగతనాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. బస్టాండ్ ఏరియాలో శనివారం ఆయన దుకాణదారులతో మాట్లాడారు. వ్యాపారస్తులందరూ సమష్టిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దుకాణ సముదాయాలకు భద్రత పెరుగుతుందన్నారు. అపరిచిత వ్యక్తులు, అనుమానితులు రాత్రి వేళల్లో సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పించినా అదే తీరు..!

- లింగాపూర్ బీట్‌లో మళ్లీ చెట్ల పొదల తొలగింపు



చెట్ల పొదలు తొలగిస్తున్న గిరిజనులు

దండేపల్లి: తాళ్లపేట అటవీ రేంజి పరిధిలోని లింగాపూర్ బీట్‌లో గల 380కంపార్ట్‌మెంట్‌లో కొద్ది రోజులుగా సమీప గిరిజన గ్రామాల ప్రజలు పోడు వ్యవసాయం కోసం అడవిలోని చెట్లపొదలను తొలగిస్తున్నారు. దీంతో సమీప గ్రామాల గిరిజనులకు పోలీస్, అటవీ శాఖ అధికారులు ఇటీవలే అవగాహన కల్పించారు. అయిన వారిలో ఏమాత్రం మార్పురావడం లేదు. శనివారం మళ్లీ సమీప గ్రామాలకు చెందిన సుమారు 40మంది గిరిజన మహిళలు గొడ్డళ్ల చేతపట్టి అటవీ భూమిలోని సుమారు ఎకరానికి పైగా భూమిలోని కొన్ని నాన్‌టేకు చెట్లతో పాటు, చెట్ల పొదలను తొలగించారు. విషయం తెలుసుకొని అటవీ శాఖ సిబ్బంది వచ్చి చెట్ల పొదల తొలగింపును అడ్డుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఏమాత్రం వారి మాటలు వినిపించుకోలేదు. ఈ సందర్భంగా పలువురు గిరిజన మహిళలు మాట్లాడారు. మేమంతా నిరుపేదలం, తడుకలు అల్లుదామంటే, వెదురు బద్దలు తేనివ్వడం లేదు. కూలీపనులకు వెళ్దామంటే ఎవరూ పనులకు పిలుస్తలేరు. మేము ఎట్లా బతుకుడు అని అటవీ సిబ్బందిని ప్రశ్నించారు. మాకు సాగుభూములు కేటాయించాలి, లేదంటే మేము పోడుకోసం అడవిలోని చెట్లను తొలగిస్తామని చెప్పారు. అటవీశాఖ సిబ్బంది తమశాఖ ఉన్నతాధికారులతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. లక్సెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి తహసీల్దార్ సంధ్యారాణి, లక్సెట్టిపేట, జన్నారం ఎస్సైలు సతీష్, రాజవర్ధన్, తాళ్లపేట ఎఫ్ఆర్వో సుష్మరావు, డీఆర్వో పోచమల్లు, ఎఫ్ఎస్వో శేషరాం అక్కడకు చేరుకున్నారు. గిరిజనులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అటవీ భూముల్లో చెట్లను తొలగించడం చట్టపరంగా నేరం అవుతుంది కాబట్టి, ఎవరుకూడా అటవీ భూముల్లో చెట్లు, చెట్లపొదలు తొలగించడం సరికాదన్నారు. చీకటిపడే వరకు అధికారులు అక్కడే ఉండి ఉన్నతాధికారులతో మాట్లాడతామని గిరిజనులకు నచ్చజెప్పే ప్రయత్నాలు చేశారు.

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

చెన్నూర్: బిందెడు నీళ్లకు గోసపడాల్సి వస్తుందని, కాలనీలో ఏర్పాటు చేసిన మోటర్ నీరు మాకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రజక కులానికి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. గతంలో కింది వాడలో ఏర్పాటు చేసిన బోరు పంపు ద్వారా నీళ్లు పట్టుకున్నామని తెలిపారు. కింది వాడకు చెందిన కొంతమంది వ్యక్తులు బోరు నీరు ఇంటి అవసరాలతో పాటు కూరగాయల తోటలకు నీరు వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. వారికి నీరు కట్ చేయాల్సింది పోయి, మాకు వచ్చే నీటి సరఫరాను మున్సిపల్ అధికారులు బంద్ చేశారని ఆరోపించారు. గతంలో నీరు సక్రమంగా సరఫరా అవుతుండగా, కొత్తగా వచ్చిన కమిషనర్ నీరు రాకుండా బంద్ చేయడమేమిటని ప్రశ్నించారు. జిల్లా అధికారులు స్పందించి మా వాడకు బోరు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు గంట పాటు ధర్నా చేశారు. అధికారులు వచ్చి నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

ఆరుగ్యారంటీలపై కళాజాత



కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

చెన్నూర్: పట్టణంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై శనివారం కళాజాత కళాకారుల బృందం సభ్యులు ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ముల్కల్ల మురళి, పోచం, రవికుమార్, రవీందర్, సత్యనారాయణ, నిరోషా, శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆరుగ్యారంటీలపై మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సాంస్కృతిక సారథి కళాకారులు ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు రమేశ్, లచ్చన్న, కృష్ణ, తిరుపతి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గని కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు శనివారం గని మేనేజర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. గనిపై ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌లో బెల్లంపల్లి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ.. కోల్ కట్టింగ్ బిట్లు, రాడ్స్, డ్రిల్స్, బూట్లు నాణ్యమైనవి రావడం లేదన్నారు. షిఫ్టులో టెక్నీషియన్‌లకు హెల్పర్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గని ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ బొడ్డుల వెంకటేష్, ఫిట్ కమిటీ ఉపాధ్యక్షుడు కొండపల్లి నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త నిరసన కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ పిలుపునిచ్చారు. హాజీపూర్ మండలం గుడిపేట లిక్కర్ గోదాం వద్ద శనివారం ఈ నెల 26వ తేదీన దేశవ్యాప్త నిరసనలకు సంబంధించిన కరపత్రాలను గోదాం కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. ఈ నెల 25న మండల కేంద్రాల్లో, 26వ తేదీన జిల్లా కేంద్రాల్లో నిరసనలకు జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్, సంయుక్త కిషన్ మోర్చ(సీఐటీయూ) పిలుపునిచ్చిన మేరకు ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లిక్కర్ గోదాం హమాలీ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, బైరి రమేశ్, కోశాధికారి మహేందర్, నాయకులు శంకర్, వెంకటేశ్, అనిల్, మహేశ్, కార్మికులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

లక్సెట్టిపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలనకు నిరసనగా ఈ నెల 26న సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే దేశవ్యాప్త నిరసన పోస్టర్ మండలంలోని నాయకులు స్థానిక క్లబ్ రోడ్ సమీపంలో ఆవిష్కరించారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు పోశవ్వ, లక్ష్మి, మల్లవ్వ పాల్గొన్నారు.

పీహెచ్‌డీకి అర్హత సాధించిన మంచిర్యాల విద్యార్థి



అనుదీప్

మంచిర్యాల అర్బన్: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) డిగ్రీ అవార్డుకు మంచిర్యాల హమాలీవాడకు చెందిన గుజ్జెటి అనుదీప్ అర్హత సాధించారు. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్‌లో ఇండియా జపాన్ రిలేషన్ ఇన్ ద ఇండో పోస్టు–కోల్డ్‌వార్ పీరియడ్ ఏ స్టడీ త్రూ నియో క్లాసికల్ రియలిస్టు ఫ్రేమ్‌వర్క్ (ఇండియా జపాన్ సంబంధాలు, నియోక్లాసికల్ ద్వారా అధ్యయనం) అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసి జూన్ 7న సబ్మిట్ చేశారు. ఈ నెల 18న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రకటించిన ఫలితాల్లో అర్హత సాధించారు. ఇటీవల రేవా యూనివర్సిటీ బెంగుళూర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం పొందారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ.. త్వరలోనే పీహెచ్‌డీ పట్టా తీసుకోనున్నట్లు, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

కొలాంగూడలో కుంరం సూరు వర్ధంతి

కాసిపేట: మండలంలోని పెద్దపూర్ కొలాంగూడలో శనివారం కుంరం సూరు వర్ధంతిని సూరు కొలాం సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల సాంస్కృతి సంప్రదాయాల ప్రకారం డోలు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి, తీర్థ ప్రసాదాలతో జెండావిష్కరించి పూలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం మహేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీంరావు, ప్రధాన కార్యదర్శి భగవంతరావు, గౌరవాధ్యక్షుడు టేకం భీంరావు తదితరులు ఉన్నారు.

‘ఎస్సీ వర్గీకరణను సమ్మతించేది లేదు’

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణను ఏమాత్రం సమ్మతించబోమని, రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు ఎస్సీలందరికీ సమంగా చెందాల్సిందేనని మాల, మాల ఉద్యోగుల జేఏసీ జిల్లా కన్వీనర్ తొగరు సుధాకర్ అన్నారు. బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన పోస్టర్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు కుంబాల రాజేష్, గజెల్లి లక్ష్మణ్, వెంకట రమణ, రవికుమార్, మల్లన్న, కనకరాజు, రాజమల్లు, మండల రవికుమార్, సబ్బని రాజనర్సు, సాత్కు శ్రీనివాస్, తొగరి సత్యనారాయణ, వెంకట గిరి, రాజేశ్వర్, నర్సయ్య మద్దెల గోపి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నియామకం

మందమర్రిరూరల్: నేతకాని మహర్ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా మందమర్రి పట్టణానికి చెందిన సునార్కర్ రాంబాబు శనివారం ఎన్నికయ్యారు.

సంక్షిప్త వార్తలు

కిష్టంపేటలో కార్డన్‌సెర్చ్

చెన్నూర్‌రూరల్: పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని కిష్టంపేట గ్రామంలో పోలీసులు శనివారం కమ్యూనిటీ కాంటాక్టు, కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నార్కోటిక్ డాగ్ సాయంతో గంజాయి విక్రయించే అనుమానితుల వ్యక్తుల ఇళ్లను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 30బైక్‌లు, ఒక ఆటో, నాలుగు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ మాట్లాడారు. యువత గుట్కా, నాటుసారా, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కి బానిసలుగా మారి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో చెన్నూర్, కోటపల్లి ఎస్సైలు సుబ్బారావు, రాజేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు

జన్నారం: మహారాష్ట్రలో బీజేపీ విజయంపై మండలంలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. నృత్యం చేస్తూ, టపాసులు కాలుస్తూ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, నాయకులు చందు, జగన్, గోపాల్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మామిడిగూడెం అభివృద్ధికి దూరం

కాసిపేట: మండలంలోని మామిడిగూడెం గ్రామం అభివద్ధికి దూరమైందని సీపీఎం నాయకులు విమర్శించారు. మామిడిగూడెంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని శనివారం పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలోని పరిస్థితులను ఉన్నత స్థాయి అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్యసాయిమందిరంలో మహారుద్రాభిషేకం

మంచిర్యాలఅర్బన్: స్థానిక రెడ్డికాలనీ సత్యసాయి సేవా మందిరంలో సత్యసాయిబాబా జయంతి సందర్భంగా శనివారం పుష్పార్చన, మహా రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు దంపతులు పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలో సత్యసాయి జయంతి సందర్భంగా మహా నగర సంకీర్తన, పల్లకి సేవ నిర్వహించారు. 500మందికి అన్న ప్రసాద వితరణ చేశారు.

భీమారం: సత్యసాయి బాబా జయంతిని మండల కేంద్రంలోని సత్యసాయి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి చిత్రపటాలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్పూరహోమంలో సాయి భక్తులు పాల్గొన్నారు.

‘ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు రద్దు చేయాలి’

జైపూర్: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు రద్దు చేయాలని బీసీ సంఘం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వొడ్నపల్లి మనోహర్ డిమాండ్ చేశారు. బీసీ ఐక్యవేదిక సదస్సు పోస్టర్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు రంగు రాజేశం, మార్త మారుతి, బత్తుల శ్రీనివాస్ యాదవ్, ఆవిడపు గణేష్, వేముల మల్లేష్, చంద్రకాంత్, రమేష్, లక్ష్మణ్, భూమన్న, శంకర్ గౌడ్, రాజన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



రోడ్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావ్

మంచిర్యాలటౌన్: నియోజకవర్గంతో పాటు, మంచిర్యాల పట్టణ అభివృద్ధి కోసం తాను ఎల్లవేళల కృషి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులను స్థానిక వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాల మార్కెట్ రోడ్డులోని ఆక్రమణలను పూర్తిగా తొలగించడంతో, రోడ్డు వెడల్పుగా మారిందన్నారు. వ్యాపారస్తులు, చాంబర్ ఆఫ్ కామర్స్ వారు మంచిర్యాల పట్టణ అభివృద్ధికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తున్నారని, పట్టణాన్ని వచ్చే 50ఏళ్లను దృష్టిలో ఉంచుకొని, భవిష్యత్ తరాల కోసం ఇప్పటి నుంచే అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. మార్కెట్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీతో పాటు, సెంట్రల్ లైటింగ్, ఇతరత్ర అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి, త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం కాలేజీరోడ్డులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం సమీపంలో నిర్మిస్తున్న శ్మశాన వాటిక పనులను ఎమ్మెల్యే పరిశీలించి, గడువులోపు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ ఇంజనీర్ మసూద్ అలీ, టీపీఎస్ శ్యాం, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేతకానీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

పాతమంచిర్యాల: నేతకానీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో శనివారం నేతకాని, మహర్ సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నేతకాని ఆత్మగౌరవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేతకానీలకు జనాభా దామాషా ప్రకారం రావాల్సిన అన్ని రకాల హక్కులు పొందే విధంగా కృషి చేస్తామన్నారు. నేతకాని కార్పొరేషన్, నేతకాని సామాజిక భవనం నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మెన్ దుర్గం నర్సయ్య, చీఫ్ అడ్వైజర్ బి.దీపక్‌కుమార్, పొలిట్ బ్యూరో చైర్మన్ ఎస్ రాజేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సర్పే సోంబాయి, తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా భూమి అప్పగింతకు చర్యలు



జేసీబీతో తొలగిస్తున్న పిచ్చిమొక్కలు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కొంతకాలం నుంచి వివాదాస్పదంగా ఉన్న షాదీఖానా భూ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. పోలీసు బందోబస్తు మధ్య శనివారం షాదీఖానా భూమికి సంబంధించి హద్దులను గుర్తించే చర్యలు తీసుకున్నారు. ఏసీపీ ఏ.రవికుమార్, ఆర్డీవో హరికృష్ణ, ఇతర పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఘటనాస్థలికి చేరుకొని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మున్సిపాలిటీకి చెందిన జేసీబీతో షాదీఖానా చుట్టూరా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించే పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి



ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

మంచిర్యాలఅర్బన్: సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి ఆరోపించారు. మంచిర్యాలలో శనివారం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మణికంఠరెడ్డి హాజరై మాట్లాడారు. గురుకులాలు, హాస్టళ్లలో ఫుడ్‌పాయిజన్ జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రజాపాలన విజయోత్సవాలకు ఖర్చుచేస్తున్న డబ్బులతో ఫీజు బకాయిలు చెల్లించాలన్నారు. విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్‌టాప్, ఇంటింటికీ ఇంటర్‌నెట్, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డులు ఏమయ్యాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు నిరవధిక బంద్ పాటిస్తున్నాయన్నారు. సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయని తెలిపారు. హాస్టళ్లు, గురుకులాల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లెనిన్, జిల్లా కన్వీనర్ అభిరామ్, నాయకులు ప్రణయ్, సాయి, సందీప్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



ఆయిల్‌పాం తోటలో విద్యార్థులు

దస్తురాబాద్: క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మండలకేంద్రంలోని ఆయిల్‌పాం తోటలను శనివారం జన్నారం మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏఈవో తిరుపతి విద్యార్థులకు ఆయిల్‌పాం సాగు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీని వివరించారు. మనం ఏటా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని పేర్కొన్నా రు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాడి మురళి, ఉపాధ్యాయులు బుచ్చి లింగయ్య, సుస్మిత, అశోక్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చికి 50 ఏళ్లు

- నేడు ఘనంగా స్వర్ణోత్సవం



స్వర్ణోత్సవానికి ముస్తాబైన చర్చి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో ఏర్పాటైన సీఎస్ఐ చర్చికి యాభై ఏళ్లు నిండాయి. ఆదివారం సాయంత్రం స్వర్ణోత్సవ కార్యక్రమానికి చర్చి నిర్వాహకులు, సంఘ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, రెవరెండ్ రూబెన్ మార్క్(ఇన్‌చార్జి బిషప్, మెదక్ డయాసిస్) రెవరెండ్ విన్‌స్టన్, తదితరులు హాజరు కానున్నట్లు, ఈ స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చర్చి ఫాస్టర్ రెవరెండ్ బంటు జర్మియా తెలిపారు.

చుంచు లక్ష్మయ్య జయంతి

పాతమంచిర్యాల: లక్సెట్టిపేట నియోజకవర్గం మా జీ ఎమ్మెల్యే చుంచు లక్ష్మయ్య జయంతిని శనివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ బీసీ జాగృతి నాయకులు ఘనంగా నిర్వహించారు. లక్ష్మయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.